అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత

- రూ.2.60 కోట్లతో జగనన్న హరిత నగరం పనులు చేపట్టాలి
- ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర పాలక సంస్థకు చెందిన ఇంజినీరింగ్ విభాగం అధికారులకు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయ ప్రాంగణంలోని కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో స్పష్టం చేశారు. నగరంలోని అభివృద్ధి పనుల పరోగతిపై ఎంఈ కె.మాల్యాద్రి నుంచి సమాచారాన్ని రాబట్టారు. జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూసుకోవాలన్నారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా అధికారులకు చార్జ్ మెమోలు జారీ చేస్తామన్నారు. ఇంకా మొదలు కాని పనులను వెంటనే ప్రారంభించేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవాలని తెలిపారు. నగరంలో జరుగుతున్న రోడ్లు, కాలువలు, ఇతర పనులపై ఎప్పటికప్పుడు సీడీఎంఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేకంగా ఉన్నతాధికారులు అడుగుతున్నారని చెప్పారు. కాంట్రాక్టర్లు వారికి కేటాయించిన రోడ్లు మరమ్మతుల నాణ్యతలో రాజీ లేకుండా చూడాలని ఆదేశించారు. సంబంధిత ఏఈలు, డీఈలు ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని తెలిపారు. జగనన్న హరిత నగరాల్లో భాగంగా ఒంగోలు నగరంలో కేటాయించిన రూ.2.60 కోట్లతో పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులను త్వరగా ఆయా కాంట్రాక్టర్ల చేత తప్పనిసరిగా పూర్తి చేయించాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను తొందరగా, ఎన్. క్యాప్ నిధుల ద్వారా నగరంలో జరుగుతున్న వివిధ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సుమారు రూ.5 కోట్లతో జరుగుతున్న త్వరగా పూర్తి చేయాలని ఎంఈ కె.మాల్యాద్రితో పాటు ఏఈలను, డీఈలకు దిశానిర్దేశం చేశారు. అందుకు సంబంధించిన యూసీని వెంటనే పంపించాలని డీఈ గణపతిని ఆదేశించారు. అదేవిధంగా స్మార్ట్ స్ట్రీట్ పనులను కూడా త్వరగా మొదలు పెట్టాలని ఆదేశించారు. డీఈలు, ఏఈలు వారివారి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, జరగాల్సిన పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏరోజుకారోజు నివేదికలు ఇవ్వాల్సిందిగా సూచించారు. ఎంఈ కె.మాల్యాద్రితో పాటు డీఈలు రఘురాం, గణపతి, పద్మజ, ఏఈలు సౌజన్య, ప్రసాదరావు, చంద్రశేఖర్ అంజిరెడ్డి, హనుమంతు, సాయిరాం పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవాలి

ఒంగోలు సబర్బన్: నగరంలో పన్ను వసూళ్ళలో నెలవారీ లక్ష్యాలను తప్పకుండా చేరుకోవాలని వార్డు సచివాలయ సిబ్బందిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నెహ్రూ నగర్ వార్డు సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు రిజస్టర్‌ను పరిశీలించారు. యూనిఫాం ధరించిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం నెహ్రూ నగర్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీని అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్ను, కుళాయి పన్నుల కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని కోరారు. క్లాప్ యూజర్ ఫీజులను కూడా తప్పకుండా వసూలు చేయాలని సూచించారు. ఎంఈ కె. .మాల్యాద్రి అధికారులున్నారు.

జిల్లా కమిటీలో నలుగురికి స్థానం



పదవులు పొందిన వారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి కమిటీలో సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి నలుగురుకు స్థానం లభించింది. వారిని శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు శాలువాలు కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. ఇనగంటి పిచ్చిరెడ్డికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా, గట్టినేని అయ్యన్న ప్రధాన కార్యదర్శిగా, షేక్ మహ్మద్ ఆలీకి కార్యదర్శిగా, బత్తుల ప్రసన్నకు కార్య నిర్వాహక సభ్యులుగా నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వారిని ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు అభినందించారు.

జేఏసీ ఆధ్వర్యంలో బాషాకు సత్కారం

చీమకుర్తి: అణగారిన కులాల ఐక్యవేదిక జేఏసీ ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డును పొందిన షేక్ ఖాదర్‌బాషాని శుక్రవారం చీమకుర్తిలో ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌కు చెందిన హోప్ అనే సంస్థ ఖాదర్‌బాషా ముస్లింలకు చేసిన సేవలకు గుర్తుగా డాక్టరేట్ అవార్డును ఇటీవల ఇచ్చారు. పేరం శ్రీనివాసరావు, సోమా శేషాద్రి, బత్తుల మల్లికార్జున, బండ్ల కొండలరావు, చింతకింది అశోక్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందనలు తెలిపారు.

ప్రకటన

నాక్లైంటు కోడూరి కమలాకర్, తండ్రి ప్రసాద్, ఒంగోలు అనువారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది.

నాక్లైంటు తనయింటి Original Reg. Sale Deed తోపాటు దాని Link Document Original Reg. Sale Deed 27.07.1990 D.No.2759/90 SRO, Ongole. తీసుకొని Clough pet తన యింటి నుండి Railway Station దగ్గర Xerox Shopకి పోయి ఈ రోజు అనగా 24.08.2023 Xerox తీసుకొని యింటికి వెళ్ళి చూసుకొనగా పై తెలిపిన Original Reg. Sale Deed Miss అయినది. ఎవరికైనను దొరికిన క్రింది అడ్రస్‌కు వెంటనే తెలుపగలరు.

Ongole
Dt.24.08.2023

R.V.S. BHARADWAJA
Advocate, Ongole.
Cell: 94937 81705.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఒంగోలులోని తన కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. 11 గంటలకు కొమరోలు పట్టణంలో , సాయంత్రం 4 గంటలకు ఒంగోలులో హాజరవుతారు.

రుణమేళాతో మహిళల అభ్యున్నతి

- అల్లూరు ఆర్‌బీకేలో మెగా రుణమేళా



మహిళలకు రుణమేళా గురించి వివరిస్తున్న రాజశేఖర్

అల్లూరు (కొత్తపట్నం): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికే రుణమేళా కార్యక్రమం ఏర్పాటు చేశామని జగనన్న పాల వెల్లువ జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ రాజశేఖర్ అన్నారు. అల్లూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మెగా రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ శోభ అధ్యక్షత వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్థిరపడటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. అందులో భాగంగా మెగా రుణమేళా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అమూల్ పాల కేంద్రాల్లో పాలు పోసే మహిళా రైతులకు బ్యాంక్‌ల నుంచి రుణాలు ఇచ్చామన్నారు. గేదెలు ఉన్న వారికి, గేదెలు లేకుండా కొత్తగా కొనుగోలు చేసే వారికి రుణ సదుపాయం ఉంటుందన్నారు. సొసైటీలకు కూడా రుణం మంజూరు చేసే వెసులుబాటు ఉందన్నారు. 7 శాతం వడ్డీ చెల్లించాలన్నారు. మూడు సంవత్సరాల్లో సకాలంలో చెల్లిస్తే వారికి తిరిగి 7 శాతం వడ్డీ అకౌంట్‌లో జమ అవుతుందని చెప్పారు. రూ.1లక్ష నుంచి రూ.1.60 లక్షలు లోను ఇస్తామన్నారు. గేదెలు ఇచ్చిన పాల రైతులు అమూల్ పాల కేంద్రంలోనే పాలు పోయాలన్నారు. అమూల్ పాల కేంద్రంలో రిజిస్ట్రేషన్ అయిన వారికి అవకాశం ఉందని చెప్పారు. గ్రామానికి 100 మంది రైతులకు ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. అమూల్ పాల కేంద్రాల్లో పోసే పాల రైతులకు లీటర్ ధర రూ.58 నుంచి రూ.88 పెంచడం జరిగిందన్నారు. డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ శివకుమార్ మాట్లాడుతూ తీసుకున్న రుణం సకాలంలో చెల్లిస్తే పాల రైతుకు లాభం చేకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంత పాల రైతులకు ఈ రుణం ఎంతో లాభంగా ఉంటుందని చెప్పారు. సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, పీడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బి.బసవశంకర్, పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ హమీబీ, ఎంపీటీసీ సభ్యుడు శాంతారావు, ఏపీఎం రజియాసుల్తాన్ బేగం, పశువైద్యాధికారి పాల్గొన్నారు.

28న తెలుగు భాషా దినోత్సవం

ఒంగోలుమెట్రో: కళామిత్ర (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక నారాయణ పబ్లిక్ స్కూల్, నిర్మల్ నగర్‌లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డా.నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా కొల్లా సౌజన్య, కుర్రా ప్రసాద్‌బాబు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, మిడసల మల్లిఖార్జున రావు, తదితరులు పాల్గొంటారన్నారు. సాంస్కృతిక విభాగం పాత్రికేయులు బెజవాడ ప్రసాద్, శీలంకోట్టిరెడ్డి, డా.లంక ప్రసన్నకుమార్, సురవరాజు రాము శర్మ, వేసుపోగు కోటయ్యకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు. యూవీ రత్నం, కోవెలకుంట్ల బాలకోటయ్య, ఓరుగంటి ప్రసాదులు నిర్వహణ సహకారాన్ని అందిస్తారని పేర్కొన్నారు.

నిత్యావసరాల కల్తీ అరికట్టాలి

ఒంగోలు అర్బన్: ప్రజలకు అందించే వివిధ రకాల నిత్యావసర వస్తువుల్లో కల్తీ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని కల్తీలను అరికట్టేందుకు సంబంధిత శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. శుక్రవారం పౌరసరఫరాలు, ఆహార భద్రత, తూనికలు కొలతల శాఖలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యంగా వంట నూనెలు, పాలు, పప్పు ధాన్యాల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలన్నారు. రాబోయే పది రోజుల్లో తనిఖీలు నిర్వహించి అవసరమైన మేరకు కేసులు నమోదు చేసి నివేదికలు అందజేయాలన్నారు. డీఎస్‌ఓ ఉదయభాస్కర్, తూనికలు కొలతల అధికారులు, ఆహారభద్రతా అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల నామినేషన్ పూర్తి



అధికారులను సన్మానిస్తున్న ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ అధికారులు

ఒంగోలు సబర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వంద శాతం మహిళా ఉద్యోగుల నామినేషన్‌ను పూర్తి చేసిన వివిధ సంస్థల యాజమాన్యాలను శుక్రవారం ఉద్యోగుల భవిష్య నిధి విభాగం అధికారులు సన్మానించారు. ఒంగోలులోని ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల భవిష్య నిధిసంస్థ అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ సతీష్ కుమార్ 16 సంస్థలకు చెందిన అధికారులను శాలువాలతో సన్మానించారు. పీడీసీసీ బ్యాంకు డీజీఎం సి.హెచ్.లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు ఉన్నారు.

పెయింటర్ కుమారునికి పీజీ మెడిసిన్‌లో సీటు



డాక్టర్ సతీష్

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం కామేపల్లివారిపాలెంలో పెయింట్ పనిచేసుకొనే పి.వెంకట్రావు కుమారుడు సతీష్‌కు పీజీ మెడిసిన్‌లో భాగంగా ఎంఎస్ జనరల్ సర్జన్ సీటు వచ్చినట్లు తెలిపారు. ఇటీవల రాసిన పీజీ ఎంట్రెన్స్‌లో ఉత్తమ ర్యాంకు రావడంతో తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీలో మెడికల్ సీటు సాధించినట్లు తెలిపారు. సతీష్‌ను కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు అభినందించారు.

చీటింగ్ కేసు నమోదు

ఒంగోలు సిటీ: స్నేహితుని వద్ద రూ.8 లక్షలు తీసుకొని చీటింగ్ చేసిన ఘటన ఒంగోలులో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హేమంత్‌కుమార్, మహేష్ స్నేహితులు. వీరిద్దరూ బజాజ్ ఫైనాన్స్‌లో పని చేసేవారు. హేమంత్ మానేసి సెల్‌ఫోన్ షాపు పెట్టుకున్నాడు. రెండు నెలల తర్వాత మహేష్ తనకు కూడా షాపు కావాలని హేమంత్‌ను అడిగాడు. కాగా షాపు, స్టాకు కోసం రూ. 8 లక్షల అవుతాయని చెప్పడంతో మహేష్ రూ.8 లక్షలు హేమంత్‌కుమార్‌కు ఇచ్చాడు. ఈ క్రమంలో రెండు నెలల అనంతరం మహేష్, హేమంత్‌ను అడగగా ఇప్పుడు షాపు, స్టాక్ దొరకడం కష్టమని సమాధానం చెప్పాడు. అయితే తనకు డబ్బు కావాలంటూ మహేష్ అడగ్గా, ఇప్పుడు కాదంటూ దుర్భాషలాడాడు. బాధితుని ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.